క్లుప్తంగా

తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలి



మహబూబాబాద్ రూరల్: మండలంలోని లక్ష్మతండా గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రేకుల తండాకు బీటీ రోడ్డు నిర్మాణం చేసి గిరిజన రైతులకు న్యాయం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేకుల తండా రోడ్డును సోమవారం పార్టీ బృందం పరిశీలించి సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు వెలిశాల సుధాకర్, గణేష్, స్థానికులు రవి, లచ్చు, శంకర్, రమేష్, రంగ్యా, తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని రామచంద్రాపురం కాలనీలో గల శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయ విస్తరణ అభివృద్ధి పనులకు సోమవారం ఆలయ చైర్మన్ ఆరేంద్ర వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆలయ స్థల దాత దివంగత పమ్మి కృష్ణమూర్తి కుమారులు చిరంజీవి, సనాతనాచారి, స్థానికులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలి



గార్ల: అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం రాష్ట్ర నాయకులు హరినాయక్ ఆధ్వర్యంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రాముకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పూల్‌సింగ్, భీముడు, నీలా, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు 'కానూరి' ఆదర్శం

నెహ్రూసెంటర్: అరుణోదయ వ్యవస్థాపకులు కానూరి వెంకటేశ్వర్‌రావు నేటి ప్రజాకళాకారులకు ఆదర్శమని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బండారు ఐలయ్య అన్నారు. కానూరి ఎనిమిదవ వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణ, అశోక్, లింగ్య, పాపయ్య, దేవేందర్, కృష్ణ, అనిత, తదితరులు పాల్గొన్నారు.

కురవి: మండలంలోని కొత్తూరు(జీ) శివారు బంచరాయి తండాలో కానూరి వెంకటేశ్వర్ రావు(తాత) వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా నాయకుడు బానోత్ దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ క్రికెట్ టోర్నమెంట్ విజేత బయ్యారం



బయ్యారం: ఖమ్మం జిల్లా కల్లూరులో నిర్వహించిన నాలుగు జిల్లాల స్థాయి ఫొటోగ్రాఫర్ క్రికెట్ టోర్నమెంట్‌లో బయ్యారం ఫొటోగ్రాఫర్స్ జట్టు ప్రథమ బహుమతి సాధించింది. మహబూబాబాద్ రెడిన్‌ల్యాబ్ నిర్వాహకులు లక్ష్మణ్, మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ కేస సందీప్‌లు అభినందించారు. కార్యక్రమంలో జట్టు సభ్యులు ఫక్రుద్దీన్, నరేష్, విజయ్, శివ, సల్మాన్, ప్రశాంత్, ఉమేష్, సుభాష్, వినోద్, యాని, లక్కీ, శశిధర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



చిన్నగూడూరు: మండలంలోని జయ్యారం గ్రామానికి చెందిన టి.పద్మ భర్త నర్సయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా, విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు పద్మకు రూ.29వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో శ్రీహరి, కిష్టు, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో పులుసాని వీరమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి గోపా డివిజన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ బియ్యం, రూ.2,500 ఆర్థికసాయం చేశాడు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సర్పంచ్ సారయ్య, ప్రవీణ్‌కుమార్, మహేశ్వరాచారి పాల్గొన్నారు.

అభివృద్ధిలో మొదటి స్థానంలో తెలంగాణ

● ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్



డోర్నకల్: ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

డోర్నకల్: అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిన తెలంగాణ రాష్ట్రం దేశంలో మొదటి స్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తెలిపారు. మండలంలోని గొల్లచర్ల గ్రామంలో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సారథ్యంలో వ్యవసాయం, విద్య, వైద్యం, పారిశ్రామిక తదితర రంగాల్లో విశేష ప్రగతి సాధించిందన్నారు. కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమన్నారు. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో తాను ఏడోసారి విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ మాళోత్ కవిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న పార్టీ ఆత్మీయ సమ్మేళనాలకు అపూర్వ స్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, నాయకుడు డీఎస్ రవిచంద్ర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్, మండల అధ్యక్షుడు నున్నా రమణ, మార్కెట్ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, మున్సిపల్ చైర్మన్ వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, ఎంపీపీ బాలునాయక్, జెడ్పీటీసీ సభ్యురాలు కమల, పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి భిక్షంరెడ్డి, సర్పంచ్ సమ్మిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలి



దొరవారితిమ్మాపురంలో ప్రచారం చేస్తున్న బలరాంనాయక్

గూడూరు: మాటల గారడితో ప్రజలను మభ్యపెడుతున్న కేసీఆర్ పాలనకు రాబోయే ఎన్నికల్లో చరమగీతం పాడాలని మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్ కోరారు. మండలంలోని మట్టెవాడ శివారు దొరవారితిమ్మాపురం, సురేష్‌నగర్, ఊట్ల శివారు సరస్వతీనగర్ గ్రామాల్లో సోమవారం హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి ఆధ్వర్యంలో ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బలరాం నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు వెన్నుపోటు పొడిచిన కేసీఆర్, అధికారం చేపట్టాక కుటుంబ సభ్యులకు దోచిపెడుతున్నాడన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి అధికారంలో ఉండగా, తాను మంత్రిగా ఉండి రూ.75 లక్షలు నిధులు తెచ్చానని, ఆ డబ్బుతోనే మట్టెవాడ, ఊట్ల, శివారు గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి బెల్లయ్యనాయక్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్ ఎడవెల్లి క్రిష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నూనావత్ రాధ, మాధవపెద్ది అమరేందర్‌రెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు మేకల వీరన్నయాదవ్, వేం శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

● ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

మహబూబాబాద్: అందరి సహకారం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులోగల హస్తినాపురం కాలనీలో సోమవారం 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి నిర్మాణం చేసే సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం పలు వార్డుల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పనులకు ప్రజలు కూడా అన్ని విధాలా సహకరించాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరిగి రూపు రేఖలు మారాయన్నారు. సీఎం కేసీఆర్ మానుకోట మున్సిపాలిటీకి రూ.50కోట్లు కేటాయించారని దానిలో ప్రతి వార్డుకు రూ.50లక్షలు కేటాయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, కౌన్సిలర్ బాలునాయక్, నాయకులు రవి, రాజు, శంకర్, రావిష్ పాల్గొన్నారు.

తాగునీరు రావడంలేదని ఆందోళన

మరిపెడ: నాలుగు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయిందని ఆరోపిస్తూ మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని గ్యామతండా వాసులు రోడ్డెక్కారు. మరిపెడ జాతీయ రహదారి కార్గిల్ సెంటర్ సమీపంలోని గ్యామతండాలో గల బోర్ చెడిపోయి నీరు రాకపోవడంతో మున్సిపల్ సిబ్బందికి తెలిపినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తూ సోమవారం కార్గిల్ సెంటర్‌లోని జాతీయ రహదారిపై తండా వాసులు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. సంఘటనా స్థలానికి మున్సిపల్ కమిషనర్ రాజు, సీఐ సాగర్‌లు చేరుకొని ఆందోళన చేస్తున్న వారికి సర్ది చెప్పి వెంటనే బోర్‌కు మరమ్మతులు చేయిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నెహ్రూసెంటర్: ఈనెల 15వ తేదీన హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే సామాజిక రచయిత్రి, అధ్యాపకురాలు కందాల శోభారాణి యాదిసభ వాల్‌పోస్టర్లను సోమవారం ప్రజాసంఘాల నాయకులు ఆవిష్కరించారు. సభకు సాహితవేత్తలు, మేధావులు, కవులు, రచయితలు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సోమన్న, వెంకన్న, అజయ్‌రెడ్డి, నవీన్, వేణు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

తొర్రూరు రూరల్: మండలంలోని అరిపిరాల గ్రామంలోని వృద్ధులకు ఉచితంగా దుప్పట్లను లయన్స్ క్లబ్ టీచర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వల్లపు గోపమ్మ, టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాయిపెల్లి యాకయ్య, చింతల సురేష్, నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



నిరసన దీక్షలో కూర్చున్న పెన్షన్‌దారులు

మహబూబాబాద్: పెన్షన్‌దారుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మైస నాగయ్య, ప్రధాన కార్యదర్శి వలబోజు సోమయ్య డిమాండ్ చేశారు. టీఎస్ జీఆర్ఈఏ జిల్లా శాఖ, తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యచరణ సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బకాయి ఉన్న మూడు డీఆర్‌లను వెంటనే చెల్లించాలన్నారు. 2023 జూలైలో ఇవ్వవల్సిన పీఆర్సీకి కమిటీని నియమించాలన్నారు. పెన్షన్‌దారులకు ఆదాయ పన్ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈసంవత్సరం జూలై 1నుంచి రెండో వేతన సవరణ సంఘాన్ని నియమించాలన్నారు. పెన్షన్ కమ్యూటేషన్ 15 సంవత్సరాలకు బదులుగా 12 సంవత్సరాలకు పరిమితం చేయాలన్నారు. కార్యక్రమంలో మైస శ్రీనివాస్, రమేష్,ప్రసాద్, రమణయ్య, వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, సోమయ్య, సత్యనారాయణ, మంగపతి రావు, నర్సయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.

భూమి ఆక్రమించుకున్నాడని ఆందోళన



పట్టా పాస్‌పుస్తకాలు చూపిస్తున్న బాధిత రైతులు

మరిపెడ రూరల్: భూమిని బీఆర్ఎస్ పార్టీకి చెందిన నరేష్‌రెడ్డి ఆక్రమించుకొని దౌర్జన్యంగా కంచె ఏర్పాటు చేసుకున్నాడని మండలంలోని బీచ్‌రాజ్‌పల్లి గ్రామ శివారు జర్పులతండాకు చెందిన బాధిత గిరిజన రైతులు ఆరోపించారు. సోమవారం మండలంలోని పురుషోత్తమాయగూడెం శివారులో కబ్జాకు గురైన భూమి వద్ద బాధిత రైతులు తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా బాధిత రైతులు జర్పుల వెంకన్న, రమేష్, జర్పుల రవి, జర్పుల చినరమేష్, జర్పుల కాంతి, బుజ్జి మాట్లాడుతూ.. మా తాత జర్పుల జేత్యనాయక్, నరేష్‌రెడ్డి గారి తండ్రి గారు అయిన రఘునాథ్‌రెడ్డిగారి వద్ద సుమారు 65 ఏళ్ల క్రితం పురుషోత్తమాయగూడెం రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 44, 50లో 5ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పాస్ పుస్తకాలను విలేకరుల ఎదుట ప్రదర్శించారు. అయినప్పటికి నరేష్‌రెడ్డి ఇందులోని 3 ఏకరాల భూమిని అక్రమించుకొని కంచె ఏర్పాటు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై నూకల నరేష్‌రెడ్డిని వివరణ కోరగా మా తండ్రి గారు అయిన రఘునాథ్‌రెడ్డి జేత్యనాయక్‌కు అమ్మింది కేవలం 2 ఎకరాలు మాత్రమేనని, మిగిలిన మూడు ఎకరాల భూమిని వారే దౌర్జన్యంగా అక్రమించుకొని పట్టా పాస్ బుక్కులు పొందారని పేర్కొన్నారు. మా భూమిని అక్రమించుకున్న పట్టా చేయించుకున్న వారిపై కేసు పెట్టినట్లు నరేష్‌రెడ్డి తెలిపారు.

కుట్రపూరితమైన పాలన సాగిస్తున్న బీజేపీ



కేసముద్రం: మాట్లాడుతున్న దస్రూనాయక్

కేసముద్రం: బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితమైన పరిపాలన సాగిస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్ అన్నారు. సోమవారం పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం టీపీసీసీ పంపిన మండల కమిటీ ఫార్మెట్ ప్రకారం మండల కమిటీని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, సర్పంచ్ గంట సంజీవరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్‌రావు, ఎండీ.అయూబ్‌ఖాన్, బాలునాయక్, తదితరులు పాల్గొన్నారు.

గెలుపునకు సమష్టిగా కృషి చేయాలి

చిన్నగూడూరు: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆరోగ్య ఉపకేంద్రం శివారులో కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమలాకర్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదాం, బిక్కునాయక్, విజయ్‌రాజ్ పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: ఈనెల 16, 17, 18 తేదీల్లో తిరుపతిలో జరుగనున్న ఇఫ్టూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పర్వత కోటేష్, హెచ్.లింగన్న అన్నారు. జిల్లా కేంద్రలలోని సంఘ కార్యాలయంలో సోమవారం మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేసేందుకు అఖిల భారత మహాసభలోల చర్చించి భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎండీ జబ్బార్, సయ్యద్ నిజాముద్దీన్, లక్ష్మయ్య, ఐలయ్య, సురేష్, లింగన్న, రామ్మూర్తి, అశోక్ పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తొర్రూరు రూరల్: రైతులు, అన్నివర్గాల ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ తూర్పాటి అంజయ్య, జెడ్పీ ఫ్లోర్‌లీడర్ మంగళంపెల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పోలెపెల్లి గ్రామంలో రూ.1.90కోట్ల నిధులతో ఏర్పాటు చేసేందుకు 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైంది. సోమవారం ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులతో కలిసి సీఎం కేసీఆర్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పందుల యాకయ్య, మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మండల కోఆప్షన్ అంకూస్, ఉపసర్పంచ్ గజ్జి రాజు, గ్రామ అధ్యక్షుడు యాకన్న, నాయకులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' శిబిరం ప్రారంభం



కురవి: కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ పద్మావతి

కురవి: సీఎం కేసీఆర్ పేదల కంటి సమస్యలను పరిష్కరించేందుకు అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గుగులోత్ పద్మావతిరవినాయక్ అన్నారు. సోమవారం మండలంలోని నేరడ శివారు ఎల్కచెట్టు తండా గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ అంబరీష, సర్పంచ్ అమ్రిబాయి, సొసైటీ చైర్మన్ దొడ్డ గోవర్ధన్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: మానుకోట మండలంలోని బలరాంతండాలో గల రైతు వేదిక భవనంలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ ఎల్ది మల్లయ్య గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలవేణి హరినాయక్, వైద్యుడు క్రాంతి, ఉప సర్పంచ్ వీరన్న, వార్డు సభ్యుడు బానోత్ వీరన్న, కార్యదర్శి నరేష్, తదితరులు పాల్గొన్నారు. రేగడి తండా గ్రామపంచాయతీలో కంటి వెలుగును సర్పంచ్ గుగులోతు లక్ష్మీరామచంద్రనాయక్ ప్రారంభించారు.

అక్రమ పట్టాలు రద్దుచేయాలి

నెల్లికుదురు: మండల కేంద్రంలోని 317 సర్వేనంబర్ ప్రభుత్వ భూమిలో అక్రమంగా పట్టాలు చేసిన అధికారులపై చర్యలు తీసుకుని జారీ చేసిన పట్టాలు రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పెరుమాండ్ల తిలక్ బాబు గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు తహసీల్ కార్యాలయం ముందు సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ యోగేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములపై సర్వేనిర్వహించి అన్యాక్రాంతం కాకుండా నిరుపేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సైదులు, ఎల్లయ్య, వీరెంకులు, నర్సయ్య, యాకయ్య, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పుస్తక ఆవిష్కరణ

నెహ్రూసెంటర్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డయాలసిస్ టెక్నాలజీ (ఐఏడీటీ) ప్రధాన కార్యదర్శి, జిల్లాకు చెందిన డాక్టర్ హరికుమార్ రాగి రచించిన డయాలసిస్ సాంకేతిక పరిజ్ఞాన పుస్తకాన్ని సోమవారం ఢిల్లీలోని ఐఏడీటీ 4వ జాతీయ సదస్సులో ఆవిష్కరించారు.

జయప్రదం చేయండి

బయ్యారం: ఈనెల 25, 26, 27 తేదీలలో ఆలేరులో నిర్వహించనున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు సనప పొమ్మయ్య ఆధ్వర్యంలో సోమవారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, మురళీకృష్ణ, రాంబాబు, గంగులు, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

బయ్యారం: లక్ష రూపాయల వరకు రైతులు తీసుకున్న రుణాలు ప్రభుత్వం వెంటనే మాఫీ చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు వెంకన్న, వెంకటనర్సు, భిక్షం, సత్యం పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

పెద్దవంగర: చిరుధాన్యాలను మనం రోజు తీసుకునే ఆహారంలో చేర్చుకోవాలని లక్ష్యం స్వచ్ఛంద సంస్థ సీఈఓ లత అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల చిరుధాన్యాలపై ప్రారంభించిన శిక్షణ కేంద్రాన్ని సోమవారం సర్పంచ్ లక్ష్మి రామచంద్రయ్యశర్మతో కలిసి ఆమె సందర్శించారు.

12 రకాల సరుకులు అందించాలి

కేసముద్రం: ప్రజలకు రేషన్‌షాపుల ద్వారా 12 రకాల నిత్యావసర వస్తువులు అందించాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పైండ్ల యాకయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో రేషన్‌షాపు వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కందాల రంగయ్య, వెంకన్న పాల్గొన్నారు.

నేడు పూలే జయంతి వేడుకలు

మహబూబాబాద్ అర్బన్: మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలు మంగళవారం ఉదయం 10:30 గంటలకు జిల్లా కేంద్రంలోని పతిపాక ఇండియన్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనకబడిన తరగతులు అభివృద్ధి శాఖ అధికారి నర్సింహస్వామి సోమవారం తెలిపారు. విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పండ్లు, పెన్నుల పంపిణీ



కేసముద్రం: మండల కేంద్రంలోని బ్రహ్మంగారి తండాలో గల ప్రాథమిక పాఠశాలలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గుగులోతు వీరునాయక్ జన్మదినం సందర్భంగా, విద్యార్థులకు పండ్లు, పెన్నులు, పెన్సిళ్లను సోమవారం అందజేశారు.

బీఆర్ఎస్‌ను బలోపేతం చేయాలి

కురవి: మండలంలో బీఆర్ఎస్‌ను బలోపేతం చేయాలని మండల అధ్యక్షుడు తోటలాలయ్య, జిల్లా నాయకుడు బజ్జూరి పిచ్చిరెడ్డి అన్నారు. నారాయణపురం గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా అల్లూరి వీరభద్రరాజుకు నియామక పత్రాన్ని సోమవారం అయ్యగారిపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాస్కర్‌నాయక్, నాయకులు రవినాయక్, వాసురాజు, రమేష్ పాల్గొన్నారు.

వైద్యశిబిరం

కురవి: సీరోలు మండల కేంద్రంలోని ఏకలవ్య గిరిజన మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో కురవి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్యురాలు విరాజిత, డాక్టర్ సుమతి, స్టాఫ్‌నర్సులు అనురాధ, కవిత, ఫార్మసిస్టు సునీల్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

చైర్మన్ పదవి ఎస్సీలకు ఇవ్వాలి

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయ చైర్మన్ పదవిని ఎస్సీలకు కేటాయించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు తేజావత్ అభినాయక్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, ఉపేందర్, రాములు, శ్రీను, చింటు, ప్రేమ్‌కుమార్, ఏలేందర్ పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ

మహబూబాబాద్ రూరల్: మహబూబాద్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ ఇరుపక్కల, బస్టాండ్ సెంటర్‌లో చిరువ్యాపారులకు గొడుగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సోమ రజనికుమార్, కార్యదర్శి సోమ రాధాకృష్ణ, కోశాధికారి పుల్లకండం ప్రభాకర్, కిషోర్, హరిప్రసాద్, రవి, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కేసముద్రం: ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ వోలం చంద్రమోహన్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలం యాకయ్య, తారాసింగ్ జీపీ సర్పంచ్ శంకర్ పాల్గొన్నారు.


జార్జిరెడ్డి అమరత్వాన్ని స్మరించుకుందాం..

మహబూబాబాద్ అర్బన్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి ఉద్యమ రథసారథి ఉస్మానియా యూనివర్సిటీ వేగుచుక్క 51 ఏళ్ల జార్జిరెడ్డి అమరత్వాన్ని ఈనెలలో స్మరించుకుందామని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం వాల్‌పోస్టర్లను పీడీఎస్‌యూ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో భూమిక, శ్యామలత, మౌనిక, స్వర్ణ, ప్రీతి, నవ్య, శిరీష, శ్వేత, హర్షిత, శ్రీవల్లి పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ

బయ్యారం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన దివ్యాంగులకు ఆర్టీసీ ఆధ్వర్యంలో సోమవారం బయ్యారంలో బస్‌పాస్‌ల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఇన్‌చార్జ్ ఆకుల వెంకటేశ్వర్లు, దివ్యాంగుల సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, వీరస్వామి పాల్గొన్నారు.

అనుబంధాలకు ఆయువు పోస్తున్న 'బలగం'



పెద్దవంగర: బలగం సినిమా బంధాలకు అనుబంధాలకు ఆయువు పోస్తోందని, ఈచిత్రాన్ని చూసిన ప్రజల భావోద్వేగాలు కట్టలు తెంచుకున్నాయని ఎస్సై రాజు అన్నారు. సోమవారం మండలంలోని అవుతాపురం గ్రామంలో గ్రామ ప్రముఖుడు తోటకూరి శ్రీనివాస్ సాకారంతో అతని అమ్మమ్మ తాత బొమ్మెరబోయిన రామలక్ష్మి–వెంకన్నల జ్ఞాపకార్థం ప్రొజెక్టర్ ద్వారా చిత్రాన్ని ప్రదర్శించారు.

క్రైం కార్నర్..

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

కేసముద్రం: ఇంట్లో తలెత్తిన గొడవ కారణంగా తీవ్ర మనస్తాపం చెందిన ఓ వివాహిత మహిళ ఎలుకల మందు తాగగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన ఇనుగుర్తి మండలంలోని లాలుతండాజీపీ శివారు రాముతండాలో చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన జరుపుల హుస్సేన్‌కు ఇద్దరు భార్యలు ఉన్నారు. కాగా పెద్ద భార్యకు కూతురు ఉండగా, చిన్నభార్య జరుపుల స్వరూప(47)కు సంతానం కలుగలేదు. ఈక్రమంలో ఎవరినైనా సాధుకుందామనే విషయంలో స్వరూప, హుస్సేన్ దంపతుల మధ్య గొడవ తలెత్తింది. దీంతో మనస్తాపం చెందిన స్వరూప ఈనెల 2న ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందింది. సోమవారం మృతురాలి తల్లి నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు..

దంతాలపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బొడ్లాడ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై కూచిపూడి జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శంకరబోయిన సందీప్(18), తండ్రి వీరన్నతో కలిసి జామతోటకు వెళ్లాడు. ఇంటికి వెళ్లి అన్నం తీసుకురమ్మని తండ్రి కొడుకు సందీప్‌కు చెప్పాడు. సందీప్ నడుచుకుంటూ వెళ్తుండగా మార్గమధ్యలో రెండె ఎద్దులు బొడ్లాడ శివారులో పొడుచుకుంటూ ఒక్కసారిగా సందీప్‌పై పడగా పక్కనే ఉన్న బండపై పడ్డాడు. కుడి కన్ను, చెంపకు తీవ్ర గాయాలవడంతో కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మృతుడి తండ్రి వీరన్న తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగదీష్ తెలిపారు.